క్లుప్తంగా

'ఇందిరా క్యాంటీన్' ప్రారంభం



వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే నాగరాజు, జేడీఎం శ్రీనివాస్, కార్యదర్శి జి.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించండి



నయీంనగర్: అటవీ అధికారులు తమ భూములను లాక్కుంటున్నారని, వాటికి రక్షణ కల్పించాలని ముప్పారం గ్రామ రైతులు కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముప్పారం గ్రామ శివారులో వ్యవసాయం చేయకుండా అడ్డుకుని కేసులు పెడుతున్నారని వాపోయారు. సమావేశంలో మల్లయ్య, యాదగిరి, రాములు, మాదిరెడ్డి రాజారెడ్డి, నర్సయ్య, శ్యామల, మహేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రజిత, శోభారాణి, కనకలక్ష్మి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో చేటు

కేయూ క్యాంపస్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, విద్యతో పాటు సామాజిక సేవలో ముందుండాలని ఇంప్యాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ చల్లోజు శ్రీనివాస్ అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శశికాంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.సీతారాం, సంధ్యారాణి, గన్‌సింగ్, ఎన్‌సీసీ ఆఫీసర్లు రమేష్, ప్రసూన్న, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

'పోరాటాల ఘనత సీపీఐదే'

కాజీపేట: భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం, దున్నే వాడికే భూమి కావాలని పోరాటాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందని పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. కాజీపేట మండల కేంద్రంలోని వైఎస్సార్ నగర్ కాలనీలో నగర శాఖ మహాసభలను గురువారం ప్రారంభించారు. మహాసభలకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్ అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, జానపట్ల మంజుల, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

న్యూశాయంపేట: ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. చింతల్ ప్రాంతంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్దం రాజు, నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బహిరంగ సభ విజయవంతానికి కార్పొరేటర్లు, నాయకులు కీలకంగా పనిచేయాలని సూచించారు.

'బార్' అధ్యక్షుడికి సన్మానం



హన్మకొండ: హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణను ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. హనుమకొండ సుబేదారిలో గురువారం జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యుడు పిట్టల కమలాకర్, గ్రంథాలయం సభ్యుడిగా ఎన్నికైన కాటబోయిన వెంకటేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మామునూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సృజనాత్మకత మెరుగు పడుతాయని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్‌యాదవ్ సూచించారు. వరంగల్ బొల్లికుంట వాగ్దేవి క్రీడా మైదానంలో జేఎన్టీయూ, కేయూ అనుబంధ ఫార్మసీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న ప్రారంభమైన ప్రీమియర్ లీగ్ మ్యాచ్ క్రికెట్ క్రీడాపోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో మక్కువ పెంచుకుంటే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. హనుమకొండ సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల క్రికెట్ టీమ్ ప్రథమ, కేర్ ఫార్మసీ కళాశాల ద్వితీయ స్థానాల్లో నిలిశాయి. విజేతలకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్‌యాదవ్, అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

వరికోతల్లో జాగ్రత్త అవసరం

- సరైన సమయంలో పనులు చేపట్టాలి
- పూర్తిగా ఎండిపోతే రైతుకు నష్టం



సోమిడి శివారులో మిషన్‌తో వరి కోస్తున్న డ్రైవర్

కాజీపేట: వరి కోతలు ఊపందుకుంటున్నాయి. సరైన సమయంలో కోతలు చేపట్టకపోతే రైతులు నష్టపోయే అవకాశం ఉంటుంది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కోతలు, ఆ తర్వాత ధాన్యం నిల్వ చేయడం వంటి వాటిపై అన్నదాతలు అవగాహన పెంచుకోవాలి. కాజీపేట మండలంలో దాదాపు 6వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. వరి కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాజీపేట మండల వ్యవసాయ అధికారి సంతోష్ పలు సూచనలు చేసి, సలహాలు ఇచ్చారు.

కోతకు ముందు ఇలా..

కోతకు 15 రోజుల ముందే నీటి తడులను నిలిపివేయాలి. చివరి గింజ తయారయ్యే వరకు వరి కోయరాదు. లేకుంటే తాలు వచ్చే ప్రమాదం ఉంది. తాలు ఎక్కువగా ఉంటే మార్కెట్‌లో ధాన్యం అమ్ముకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ధర గిట్టుబాటు కాదు. మంచు ఉన్న సమయంలో కోస్తే గింజలు మొత్తబడి నల్లగా మారితే ధర మరింత తగ్గుతుంది.

కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వరి కోతలు ఆలస్యమైతే గింజ పగుళ్లు వచ్చి ధాన్యం నూకలుగా అవుతుంది.
- 80 నుంచి 90 శాతం వరి వెన్నులు పసుపు రంగుకు మారుతున్న సమయంలోనే పంట కోయాలి. పంట పూర్తిగా ఎండిపోయే వరకు ఉంచకూడదు. ఈ దశలో వరి ధాన్యంలో సాధారణంగా 18 – 20 శాతం తేమ ఉంటుంది.
- గింజలో తేమ శాతాన్ని తగ్గించడానికి 2 – 3 రోజులు వరి మొదలును ఎండనివ్వాలి. ఒకవేళ వర్షం కురిస్తే 5 శాతం ఉప్పును వరిపై పిచికారి చేయాలి.
- వరికోత మిషన్లతో కోత, నూర్పిడి చేస్తే దుమ్ము, ధూళి, మట్టి పెల్లల వంటివి కలవకుండా జాగ్రత్త పడాలి. హార్వెస్టర్ సహాయంతో వరి కోతలు కోసేటప్పుడు రెండు వేర్వేరు రకాల ధాన్యం కలువకుండా చూసుకోవాలి.

వరి కోతల తర్వాత..

- వడ్లను తూర్పారబట్టి చెత్త, మట్టి రాళ్ల వంటి వాటిని వేరు చేయాలి.
- తూర్పార బట్టిన ధాన్యంలో తేమ 12 – 14 శాతానికి తగ్గే వరకు ఆరబెట్టాలి. ఈ విధంగా చేయడం వల్ల ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- చవుడు నేలల్లో పండించిన ధాన్యం మంచి ధాన్యంతో కలపకూడదు.
- చీడపీడలు ఆశించినా రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ధాన్యంతో పాటు కలుపు మొక్కల గింజలు లేకుండా చూడాలి.

ధాన్యం నిల్వలో..

- ధాన్యం నిల్వ చేసేటప్పుడు అధిక తేమ లేకుండా చూసుకోవాలి.
- ధాన్యం ఆశించే కీటకాల నుంచి రక్షణ కోసం పరిసరాల్లో పొగబెట్టడం మంచిది.
- పరిశుభ్రమైన గోనె సంచుల్లో లేదా గుమ్మాలలో ధాన్యం నిల్వ చేయాలి. ఎలుకలు, సూక్ష్మజీవులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం నిల్వచేసే ప్రదేశం తడి లేకుండా బస్తాలకు చిల్లులు లేకుండా చూసుకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా పాడైపోతే బాధగా ఉంటుంది. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ధాన్యం చెడిపోకుండా ఉంటుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

మడుల్లో ధాన్యం గింజలు పడకుండా చూసుకోవాలి. లేకుంటే వచ్చే సంవత్సరం ఆ గింజలే తిరిగి మొలిచి ఇతర పంటలకు ఆటంకం కలిగించవచ్చు. వరి పొలంలో కంకులు మొత్తం ఎండే వరకు ఆగాలి. తద్వారా రైతులకు సమాన స్థాయిలో ఉత్పత్తులు వస్తాయి. పొలం కోసిన తర్వాత కలుపు, ఇతర మొక్కలు ఉంటే తీసివేయాలి. ఇలా చేయడం వల్ల వచ్చే పంట సాగుకు కలుపు మొక్కలు లేకుండా నివారించవచ్చు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ చౌరస్తా: ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని 86 మందికి రూ.28,43,500 సీఎం రిలీఫ్ ఫండ్, 96మంది లబ్ధిదారులకు రూ.96,11,136 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. సమావేశంలో కాజీపేట తహసీల్దారు భావ్‌సింగ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: దళారులను రైతులు ఆశ్రయించి మోసపోవద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపురం, పెగడపల్లి, జయగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. సన్న రకానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తుచేశారు. నిబంధనల మేరకు తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ అధికారి మేన శ్రీను, పీఏసీఎస్ చైర్మన్లు బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, చల్లా గోపాల్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్ అనిల్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రవి, కుడా మాజీ డైరెక్టర్ రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంకిషన్

హన్మకొండ చౌరస్తా: పెండింగులో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గజ్జల రాంకిషన్ డిమాండ్ చేశారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓఎస్ భవన్‌లో గురువారం జరిగిన వరంగల్ జిల్లా గెజిటెడ్, ఉపాధ్యాయ, నాల్గవ తరగతి, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల సమావేశంలో నూతన జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రాంకిషన్, ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి, కోకన్వీనర్లుగా రవీందర్‌రెడ్డి, కుమార్, డాక్టర్ ప్రకాష్, గోవిందరాజులు, మధు, కృష్ణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వేణుగోపాల్, ఫణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాంకిషన్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడి 16నెలలు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడం శోచనీయమని వాపోయారు. సమావేశంలో జేఏసీ బాధ్యులు సదానందం, వెంకటేశ్వర్లు, హేమానాయక్, రాజు, దుర్గారావు, రాజేష్, రవీందర్, విజయ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



హసన్‌పర్తి: 66వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు, నీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ మేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు మాట్లాడుతూ డివిజన్‌లో నీటి సమస్యను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పలు సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లా అశోక్, మంద సుచేందర్, సుమన్, రజిత, పద్మ, మౌనిక పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓలో హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. తమ పాఠశాల నుంచి 225 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 185 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. అందులో 65 మంది విద్యార్థులు ల్యాప్‌టాప్‌లు, 119 మంది విద్యార్థులు బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నారని వివరించారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఐపీఎల్, ఎంపీఎల్ ఇన్‌చార్జ్‌లు ఉదయ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

హిమోఫిలియాపై జాగ్రత్తగా ఉండాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: కొందరికి గాయమైతే రక్తం తొందరగా గడ్డ కట్టదని, రక్తస్రావం అధికం అయినప్పుడు ప్రాణాంతకం కూడా కావచ్చని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్మోహన్‌రావు అన్నారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమోఫిలియా ఎక్కువగా పురుషులతో కనిపిస్తుందని అన్నారు. రక్తం ఆలస్యంగా గడ్డకట్టే లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ అంబరీష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని కేయూలో ధర్నా



నిరసన తెలుపుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ మొదటి గేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు వారం రోజులుగా వివిధ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. నిరసనకు ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, డీఎస్‌యూ నాయకులు గణేష్, తదితరులు సంఘీభావం తెలిపారు.

కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల ముందస్తు అరెస్టు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనివర్సిటీల్లో చేపట్టబోయే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని, జీఓ 21లో సవరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ చలో సెక్రటరియేట్‌కు పిలుపునిచ్చారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున ట్రిసిటీలోని పార్ట్‌టైం లెక్చరర్లను పోలీసులు అరెస్టు చేశారు.

మహనీయుల జయంత్యుత్సవాలు



నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

కాజీపేట / కాజీపేట రూరల్: మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవాలను అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాజీపేట చౌరస్తా నుంచి పురవీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నపెల్లి కొంరయ్య, జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, బొడ్డు దేవయ్య, రామగిరి శ్రీనివాస్, మారపాక కట్టస్వామి, సందెల విజయ్ కుమార్, కట్కూరి కిశోర్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ముగిసిన పెద్ద రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, స్థానికులు

వరంగల్: గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెద్ద రథోత్సవం వైభవంగా ఐదు రోజుల పాటు పురవీధుల్లో ఊరేగి గురువారం సాయంత్రం ఆలయ సమీపంలోని రథశాలకు చేరుకుంది. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మరిపెల్లి సంజీవరావు, ఈఓ ఎం.భాస్కర్, స్థానిక నాయకుడు చింతాకుల సునీల్‌కుమార్ సారథ్యంలో గిర్మాజీపేట బొడ్రాయి నుంచి రథోత్సవం ప్రారంభమైన గౌండ్ల వారి వీధి, రాముల వాడ, హనుమాన్ల గుడి, గుండ్ర వారి వీధి, బండి నారాయణ సర్కిల్ మీదుగా ముదిరాజ్ వీధి గర్భాలయం చేరుకుంది. మీసాల ప్రకాష్, యాట సత్యనారాయణ, గూడ శారద, నాగరాజు, రామకృష్ణ, పర్శ శ్రీనివాస్, నరహరి, సిరబోయిన మహేష్, రవీందర్, మాధవ్, వంశీ, సాగర్, రాజకృష్ణ, నవీన్, రాజు, శివ, రాజేష్, అరుణ్, వేణు, బాలు, రాజేందర్, సందీప్, దత్తు, బబ్లూ, శశిశ్యాం, దేవేందర్, సురేందర్, రాము, ప్రతాప్, ధనలక్ష్మి, అరుణ, వాణి, రజిత, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో గణపతి హోమం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హోమం జరిపించారు. హోమంలో 108 జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు.

ప్రమాదకరంగా మారుతున్న డంపింగ్ యార్డు



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కాజీపేట: మడికొండ గ్రామ శివారులోని ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, గుడిసెవాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పార్టీ జిల్లా కమిటీ బాధ్యులు ఎం.చుక్కయ్య, తొట్టె మల్లేశం, జంపాల రమేష్, కారు ఉపేందర్, రామంచ సారంగపాణి, కేతమ్మ, ప్రభాకర్, కుడిస్వామి, లక్ష్మణ్, దాసరి అనిత, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

34మంది విద్యార్థులకు ఉద్యోగాలు



నియామక పత్రం అందజేస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి: నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో విద్యభ్యసిస్తున్న 34మంది విద్యార్థులు మెడ్‌ప్లస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం తిరుమల్‌రావు మాట్లాడుతూ మెడికల్ కోడింగ్, ఫార్మాకో విజిలెన్స్ అండ్ క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో ఎంఓయూ చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక క్రీడా దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాశాల వార్షిక విద్యా, సాంస్కృతిక, క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది మండల పరశురాములు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కళాకారులు ఎల్లయ్య, వలపదాసు కృష్ణ హాజరై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ప్రత్యేక దుస్తుల్లో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, అధ్యాపకులు పరమేష్, జి.వెంకటేశ్వర్లు, వెంకట్, శ్రీధర్, మూర్తి, భగీరథ్, శైలజ, సుస్మిత, కృష్ణవేణి, మినాజొద్దీన్, రమేష్, రాజన్న, షరీఫ్, సమీనా, గీత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

రామన్నపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ప్రజాసంఘాల నాయకులు గురువారం సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కేడల ప్రసాద్, కొమురయ్య, నగేష్, లక్ష్మణ్, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యుడిగా యాదగిరి

హన్మకొండ: పరిశోధన, విస్తరణ కార్యవర్గ సభ్యుడిగా జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కన్నాయిపల్లి గ్రామ రైతు మంతపురి యాదగిరి ఎంపికయ్యారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 48వ పరిశోధన విస్తరణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మధ్య తెలంగాణ మండలం నుంచి మంతపురి యాదగిరి కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలోని కార్యవర్గం చేపట్టిన పలు కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కితాబిచ్చారు. యాదగిరిని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు అభినందించారు.

మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐటీయూసీ, తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సీపీఐ నేతలు, కార్మిక నేతలతో కలిసి రమేష్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె బద్రి, కార్మిక సంఘ ప్రతినిధులు మియాపురం గోవర్ధన్, ఎండీ.యాకూబ్, దండు లక్ష్మణ్, ఉప్పల రవి, యోగానంద చారి, నల్లతీగల కుమార్, చిరంజీవి, జన్ను రాజు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారి 27వ జన్మదిన వేడుకల ఆహ్వాన పత్రికలను భక్తులు గురువారం ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో శ్వేతార్కుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. వ్యాపారవేత్త చొక్కారపు శ్రీనివాస్, దేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ వేదమూర్తులు, గంగు సచ్చిదానంద శర్మ, మూర్తి పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

మడికొండ: కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించి, చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన తరాలపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం తరాలపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల మమత (32) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకుంటోంది. ఈక్రమంలో ఈ నెల 11వ తేదీన రాత్రి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మమత మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మామునూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మామునూరు పోలీస్ స్టేషన్ పరిధి సంగెం మండలం గుంటూరుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం పెనుముచ్చు శ్రీనివాస్ (48) కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పెనుముచ్చు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మడికొండ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం కాజీపేట మండలం టేకులగూడెం గ్రామ శివారు ఔటర్ రింగ్ రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉనికిచెర్లకు చెందిన గ్రామస్తుడు గుర్తించి సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు 50 – 55 వయస్సు గల వ్యక్తి శవాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ షాపుపై దాడి

వరంగల్: ఆరెపల్లిలో నిషేధిత, హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తూ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌లు తయారు చేసి విక్రయిస్తున్న షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈమేరకు రూ.9160 విలువైన పేస్ట్‌లతో పాటు షాపు యాజమాని మహ్మద్ సలీంపాషాను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట సైకో వీరంగం

ఎంజీఎం: మానసిక స్థితి సరిగాలేని ఓ యువకుడు మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఎదుట కత్తితో ఒంటిపై విచక్షణ రహితంగా గాయాలు చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మట్టెవాడ సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం వేణురావు కాలనీకి చెందిన పెరికమల్లె ఎల్లయ్య.. మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో పలు దొంగతనాలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తనను కొంతమంది దొంగతనాలకు ప్రేరేపిస్తున్నారని పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై కత్తితో గాయాలు చేసుకున్నాడు. సదరు వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.